





సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 24-10-2024
సంపుటి: 20 సంచిక: 179
పేజీలు: 4 వెల: రూ.1



## మహిళా కానిస్టేబుల్‌కు ఎస్ఐ లైంగిక వేధింపులు

**ఆమదాలవలస ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు**

**అవినీతిలో ఆరితేరిన చరిత్ర వెంకటేష్‌ది**

**గుట్టుచప్పుడు కాకుండా విచారణ**

# ఖా'కీచకుడు'

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చట్టాన్ని రక్షించాల్సిన అధికారులే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పోలీసుశాఖ ప్రతిష్టను మంటగలుపుతున్నారు. ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటేష్ అదే స్టేషన్‌లో పని చేస్తున్న ఒక మహిళా కానిస్టేబుల్ పట్ల అసభ్యకరంగా వ్యవహరించినట్టు వెలుగులోకి వచ్చింది. మహిళా కానిస్టేబుల్‌తో ఎస్ఐ వెంకటేష్ అసభ్యకరంగా ప్రవర్తించడం ఇది రెండోసారి అని తెలిసింది. ప్రస్తుతం ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు మహిళా కానిస్టేబుల్స్, ఒక మహిళా ఏఎస్ఐ విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో బాధిత మహిళా కానిస్టేబుల్ రెండేళ్ల క్రితం శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై ఆమదాలవలసలో పని చేస్తుంది. రోజూ శ్రీకాకుళం నుంచి ఈమె రాకపోకలు సాగిస్తుంది. నాలుగు రోజుల క్రితమే ఎస్పీని బాధిత మహిళా కానిస్టేబుల్ వాట్సాప్ ద్వారా మెసేజ్‌చేసి, ఫోన్‌లో ఎస్ఐ వెంకటేష్‌పై ఫిర్యాదు చేసినట్టు భోగట్టా. ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి డీఎస్పీ వివేకానందతో విచారణ చేయించి నివేదిక కోరినట్టు విశ్వసనీయ సమాచారం. వెంకటేష్ వ్యవహారంపై పోలీసు శాఖలో అంతర్గత విచారణ నడుస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. వారం రోజులుగా ఈ వ్యవహారంపై విచారణ జరుగుతున్నా పోలీసుల ప్రతిష్ట దెబ్బతింటుందన్న కోణంలో ఎస్ఐ ప్రవర్తనపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేసిన వ్యవహారం వెలుగులోకి రానీయకుండా పోలీసులు ప్రయత్నించారు. మహిళా కానిస్టేబుల్‌తో ఎస్ఐ అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం వెలుగులోకి రావడంతో ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.


ఎస్ఐ వెంకటేష్‌పై అనేక అభియోగాలు, ఆరోపణలు ఉన్నాయి. సంపాదనే ప్రథమ కర్తవ్యంగా విధులు నిర్వర్తిస్తుంటాడని పోలీసుశాఖలో ప్రచారం ఉంది. జిల్లాలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ప్రతిచోట వెంకటేష్‌పై ఆరోపణలున్నాయి. న్యాయం చేయాలని స్టేషన్‌ను ఆశ్రయించే బాధితుల నుంచే పెద్ద మొత్తంలో వసూలుచేసి, వారికే వ్యతిరేకంగా వ్యవహరించడంలో వెంకటేష్ దిట్టన్న టాక్ ఉంది.

శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్టేషన్ ఎస్ఐగా పని చేస్తున్నప్పుడు మితిమీరిన వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఆ ఆరోపణల నేపథ్యంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌ను కేవలం మూడు నెలల వ్యవధిలోనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఓ చెక్‌బౌన్స్ కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేయకుండా ఉండటానికి పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకున్న వ్యవహారం వెలుగుచూడటంతో ఈయన్ను ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. ఎస్ఐగా పని చేసినది మూడునెలలే అయినా అప్పటి సీఐ ఈశ్వరప్రసాద్ బదిలీ కోసం ప్రయత్నిస్తూ రాజధాని చుట్టూ తిరగడంతో వెంకటేష్ మాత్రమే స్టేషన్ బాధ్యతలు చూసేవారు. ఆ సమయంలో ఆయన గట్టిగా దండేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రాఫిక్ నుంచి మన్యం జిల్లాకు మ్యూచువల్ బదిలీ పెట్టుకున్నారు. మన్యం నుంచి ఎస్ఐ హరికృష్ణ శ్రీకాకుళం రావడానికి, శ్రీకాకుళం నుంచి వెంకటేష్ మన్యం వెళ్లడానికి విల్లింగ్ తెచ్చుకున్నారు. కానీ హరికృష్ణ ఇక్కడకు వచ్చినా మన్యంలో వెంకటేష్‌కు కావాల్సిన స్టేషన్ ఇవ్వకపోవడంతో ఆయన ఎన్నికల అనంతర బదిలీల్లో ఆమదాలవలస ఎస్ఐగా వచ్చారు. ఆమదాలవలసలోనూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు గుర్తించిన ఉన్నతాధికారులు స్టేషన్ ఇన్‌స్పెక్షన్ పూర్తిచేసి బదిలీ చేయడానికి సిద్ధమయ్యారు. అంతలోనే మహిళా కానిస్టేబుల్‌తో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు.

పోలీసులు విచారణలో వెంకటేష్ వ్యవహారంపై అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. మహిళా కానిస్టేబుల్‌ను లోబర్చుకోవాలనే ఉద్దేశంతో ఆమెతో సన్నిహితంగా ఉంటూ అసభ్యకరంగా ప్రవర్తించేవాడని విశ్వసనీయ సమాచారం. బాధిత కానిస్టేబుల్ వెంకటేష్ చర్యలను వ్యతిరేకించడంతో వేధింపులకు గురి చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారం బయటకు రాకుండా పోలీస్‌స్టేషన్‌లో అందరికీ హెచ్చరించినట్టు తెలిసింది.

సోంపేటలో ఎస్ఐగా పని చేస్తున్న సమయంలో ఒక సివిల్ తగాదాలో తలదూర్చి భారీస్థాయిలో డబ్బులు గుంజే ప్రయత్నం చేశారనే ఆరోపణలున్నాయి. సోంపేటకు చెందిన న్యాయవాది వెంకటరావు మృతిచెందిన తర్వాత వారసత్వ ఆస్తి కోసం ఆ కుటుంబంలో వివాదం చెలరేగింది. ఈ సివిల్ మేటర్‌లో వెంకటేష్ తలదూర్చి న్యాయవాది వెంకటరావు అల్లుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి మూడు రోజుల పాటు లాకప్‌లో పెట్టి డబ్బులు డిమాండ్ చేసి ఆస్తిపత్రాలపై సంతకాలు చేయాలని చిత్రహింసలకు గురిచేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న స్థానికంగా ఉన్న ఒక టీవీ ఛానల్ ప్రతినిధి వీడియో తీశాడు. వీడియో తీసినందుకు సదరు టీవీ ఛానల్ ప్రతినిధిపైనా అక్రమంగా కేసు నమెదు చేసినట్టు తెలిసింది. ఆ తర్వాత ఆ విలేకరిపై బెదిరింపులకు పాల్పడినట్టు సమాచారం. దీంతో సదరు టీవీ ప్రతినిధి తీసిన వీడియోను హ్యూమన్‌రైట్స్‌కు పంపించి ఎస్ఐ వెంకటేష్ ఒక కుటుంబ వివాదంలో తలదూర్చి అక్రమంగా ఒక ఇంజినీరింగ్ విద్యార్థిని లాకప్‌లో పెట్టి చితకబాదాడని ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన కమిషన్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై అప్పటి క్రైం అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావుని విచారణ అధికారిగా అప్పటి ఎస్పీ నియమించారు. ఈ కేసును నీరుగార్చి కేసు నుంచి బయటపడటానికి ఉన్నతాధికారికి రూ.5లక్షలు సమర్పించుకొని విచారణ నివేదికను అనుకూలంగా రాయించినట్టు వెంకటేష్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం పోలీసు శాఖలో ఇప్పటికీ చర్చనీయాంశమే. తాజాగా ఆమదాలవలసలో ఛార్జి తీసుకొని వంద రోజులు కూడా కాకముందే ఒక ఆర్‌ఎంపీ డాక్టర్‌ను అక్రమంగా కేసులో ఇరికించి జైలుకు పంపించారు వెంకటేష్. తన ప్రైవేటు వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తికి ఆరోగ్యం బాగులేదన్నా వినకుండా పని చేయించి, తీరా పరిస్థితి చేజారిపోతున్న సమయంలో ఆమదాలవలసలో ఉన్న ఒక వృద్ధ ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకువెళ్లి రాత్రికి రాత్రే ట్రీట్మెంట్ ఇప్పించారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ వెంకటేష్ ప్రైవేట్ డ్రైవర్ చనిపోయాడు. ఈ కేసులో డ్రైవర్ కుటుంబం వెంకటేష్‌ను నిందించకుండా మొత్తం నేరాన్ని ఆర్‌ఎంపీ వైద్యుని మీదకు నెట్టేసే ప్రయత్నం చేశారు.

ఆయన ట్రీట్మెంట్ వల్లే చనిపోయాడని ఆయన్ను జైలులో వేశారు. డ్రైవర్ పోస్టుమార్టం రిపోర్టును, డెత్ డిక్లరేషన్‌ను రిమ్స్‌లో వెంకటేష్ ఐదుసార్లు చించేసి వైద్యుల మీద ఒత్తిడి తెచ్చి మరీ తనకు అనుకూలంగా రాయించినట్లు ఇప్పటికీ గుసగుసలు వినిపిస్తున్నాయి. వెంకటేష్ అవినీతి చరిత్రను పోలీసు వర్గాలేవీ ఖండించడంలేదు. డబ్బే పరమావధిగా పని చేస్తారని, అందుకే ఆయన కోరుకున్న చోటకు బదిలీలు జరుగు తాయని పోలీస్ శాఖలో చెప్పుకుంటున్నారు. ఎస్పీగా మహేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో సంఘ వ్యతిరేక శక్తులను ఏరివేయడంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు సొంత శాఖలోనే ఒక ఎస్ఐ అదే శాఖలోని ఒక మహిళా కానిస్టేబుల్ పట్ల అనుచితంగా ప్రవర్తించడంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారోనన్న అంశంపై అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



• ఎడిటోరియల్

# స్వాములకే బుర్ర పని చేయడంలేదు!

సనాతన ధార్మిక నేతృత్వం.. విచిత్రంగా ధ్వనించి, నిర్వచనం కష్టమైన పదం. సనాతన ధర్మానికి ఒకరు నేతృత్వం వహించేది ఏమిటి? అసలు హిందూ ధర్మానికి ఈ పీఠాలు ప్రాతినిధ్యం వహిస్తాయా? నిజంగా హిందూ మతవ్యాప్తికి ఈ పీఠాధిపతులు చేస్తున్న కృషి ఏమిటి? పాదపూజలు, సంభావనలు తప్ప ఇంకేం పట్టింది? చేస్తున్నారనే అనుకుందాం సరే.. బీజేపీ మాత్రమే ఎందుకు పట్టించుకోవాలి? ఇదే ప్రశ్న సోకాల్డ్ సెక్యులర్ పార్టీలకు ఎందుకు వేయవద్దు? ఈ ప్రశ్నలు ఎందుకు తలెత్తుతున్నాయంటే.. అత్యంత వివాదాస్పద స్వామి ఒకాయన జమ్ములో మాట్లాడుతూ 'ధర్మాచార్యులను బీజేపీ పట్టించుకోవట్లేదు' అని విమర్శించాడు. గోమాతను రాజ్యమాతగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, 36 రాజధాని కేంద్రాల్లో గోధ్వజ్ ప్రతిష్ఠ కార్యక్రమం కోసం దేశమంతా తిరుగుతున్నాడు ఆయన. సనాతన ధర్మ నేతృత్వం అనగా ఏమిటో ముందుగా ఆయన నిర్వచించాలి. అది బీజేపీ బాధ్యతే ఎందుకు అవుతుందో కూడా చెప్పాలి.. కానీ చెప్పడు. వివాదాలు, శుష్క ఆరోపణలతో ఆయన హిందూ మతానికి నష్టం చేకూర్చడమే తప్ప తనతో వీసమెత్తు ఫాయిదా లేదు. ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్మఠ్ శంకరాచార్యుడు ఆయన. చాలామంది శంకరాచార్యులు ఉన్నారు మనకు. అందులో ఈయన కూడా ఒకరు. అసలు ఆ మఠాధిపతి స్వరూపానంద అస్తమయం తర్వాత ఈయన పగ్గాలు చేపట్టడమే ఓ వివాదం. సుప్రీంకోర్టులో విచారణ కూడా జరిగింది. ఓ స్వామి మాట్లాడితే ఒక్క పొల్లు మాట రాకూడదు. ప్రతి పదానికి విలువ ఉండాలి. ఈయన దానికి పూర్తిగా భిన్నం. అయోధ్యకు పిలవలేదు అంటాడు తనను.. కానీ అయోధ్య నిర్మాణం పూర్తి గాకముందే ప్రాణప్రతిష్ఠ కూడదు అంటాడు. మళ్లీ తనే అది పూర్తిగా బీజేపీ కార్యక్రమంలా సాగింది అంటాడు. ధర్మాచార్యులను బీజేపీ పట్టించుకోవడం లేదంటాడు. అందుకే అయోధ్యకు వెళ్లలేదు అంటాడు. అప్పుడే ఉద్ధవ్ ఠాక్రేను మోసగించారు అంటాడు. (పరోక్షంగా బీజేపీ మీద విమర్శ) రాహుల్ గాంధీ భేష్ అంటాడు ఓసారి. మళ్లీ తనే హిందువులను మేల్కొల్పడంలో మోడీ మంచి కృషి చేస్తున్నాడంటాడు. ఆర్టికల్ 370 ఎత్తివేత, పౌరసత్వ సవరణ చట్టాల్ని స్వాగతించామనీ అంటాడు. మొన్నామధ్య కేదారనాథ్ ఆలయానికి చెందిన 228 కిలోల బంగారం మాయమైందనీ, ఢిల్లీలో ఆ సొమ్ముతోనే కేదారనాథ్ నమూనా గుడిని కడుతున్నారనీ ఆరోపించాడు. ఆలయ బాధ్యులు స్ట్రాంగ్ కౌంటర్స్ ఇవ్వడంతో నోరుమూసుకున్నాడు. గొడ్డుమాంస భక్షణను వ్యతిరేకిస్తాడు. అందుకే గోధ్వజ్ ప్రతిష్ఠకు వెళ్తే రెండుమూడు ఈశాన్య రాష్ట్రాలు ఆయన ప్రవేశాన్ని అడ్డుకున్నాయి. అనవసర వివాదాలకు, తగాదాలకు అవకాశం ఇవ్వకూడదని..! మొదటి నుంచీ ఇంతే. నోరిప్పితే చాలు ఏదో పంచాయితీ. మాట మీద నిలకడ ఉండదు. ఏం మాట్లాడుతున్నాడో తనకే తెలియదు పలుసార్లు. ఈయన సనాతన ధార్మిక నేత అట. ధర్మాచార్యుడట. బీజేపీ పట్టించుకోవాలట. అంటే ఏం చేయాలి? అసలు ఈయన పీఠాధిపత్యమే సరికాదని సుప్రీంలోనే విచారణ సాగింది కొన్నాళ్లు. శివానంద యోగవిద్యాపీఠం స్వామి గోవిందానంద సరస్వతి ఈయన్ని ఉద్దేశించి 'దొంగ బాబా' అని తేల్చిపడేశాడు. దీనిపై అవిముక్తేశ్వరానంద ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేస్తే.. సాధువులు ఇలాంటివి పట్టించుకోవడం ఏమిటి, స్వాములు తమ పనులతోనే గౌరవం పొందుతారు తెలుసా అని హైకోర్టు హితవచనాలు పలికింది. ఒకడికి వంటలు చేయడంలో నైపుణ్యం ఉంటుందా? మరొకరికి విమానాలు నడపడంలో నైపుణ్యం ఉంటుందా? మరొకడికి చెత్త ఊడవడంలో నైపుణ్యం ఉంటుందా? ఆయా నైపుణ్యతలను బట్టి కులాలు ఏర్పడ్డాయా? అందుచేత కుల వ్యవస్థ ఉండాలా? అంటే ఈ నైపుణ్యతలన్నీ ఆయా మనుషులు పుట్టి పెరిగి యుక్త వయసు వచ్చాక వాళ్లు దేనికి సరిపోతారో పరీక్ష జరిపి ఆ తర్వాత వాళ్లను వాళ్ల నైపుణ్యతల ఆధారంగా కులాలుగా విభజిస్తారా? శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి సెలవిచ్చిన మాటలు పైన చెప్పినవి. ఒళ్లంతా ఎంత వెటకారం ఉంటే అలా వెటకరిస్తారు? దళిత బహుజనాదులుగా గల శూద్రవర్గాలన్నీ బ్రహ్మ నోటి నుంచి భుజాల నుంచి కడుపు నుంచి పుట్టిన వర్గాలకు మిగిలిన కాళ్ల దగ్గర నుంచి పుట్టినటు వంటి జట్టు అంతా సేవలు చేస్తూ కూర్చోవాలి అన్నమాట. ఇదే స్వామివారు ఆమధ్య సెలవిచ్చారు. మళ్లీ సన్నటి గొంతుతో వెటకారం జోడించి చేసే హేళన ఒకటి అదనం. మనిషి ఎన్ని సంకెళ్లనైనా ఛేదిస్తాడు గానీ పుట్టుకతో వచ్చిన అంటరాని కులమనే సంకెళ్లను ఛేదించలేడని పెరియార్ చెప్పిన మాట ఈ జీయర్లకు ఎలా అర్థమవుతుంది? మనిషి పుడుతూనే ఒకడు వేద పఠనానికి, మరొకడు పెంట ఊడవడానికి అర్హతలు కూర్చుకుని పుట్టారా? ఇదెక్కడి దుర్మార్గపు వాదన జీయర్ గారు? అసలు స్వామీజీలు ఏం బోధించాలి? ఏం చేస్తున్నారు?

# రోడ్లే పార్కింగ్ కేంద్రాలు

- రోడ్డుపై అడ్డదిడ్డంగా యూటర్న్‌లు
- ప్రయాణికుడు కనిపిస్తే సడన్ బ్రేక్
- ప్రజలు గాయాలపాలవుతునా పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు
- ఎవరైనా ప్రశ్నిస్తే ఆటోవాలాల ఎదురుదాడి
- డే అండ్ నైట్ జంక్షన్‌లో నడవడానికీ తోవుండదు
- ట్రాఫిక్ కానిస్టేబుళ్లనూ మేనేజ్ చేస్తున్న వైనం
- అధికారులు చర్యలు తీసుకుంటే రాజకీయ నాయకుల జోక్యం



"డే అండ్ నైట్ జంక్షన్, పొట్టిశ్రీరాములు జంక్షన్, కాంప్లెక్స్ ఏరియాల్లో ఉదయం, సాయంత్రం పూటల్లో నడవలేనంతగా ఆటోలు రోడ్డుకి ఇరువైపులా నిలిపి ప్రయాణికుల కోసం ఎదురుచూస్తుంటారు. కాంప్లెక్స్, కొత్త బ్రిడ్జి రోడ్‌లో నడవడానికి కూడా వీలుండదు. అక్కడే హెల్మెట్ లేదని, లైసెన్స్ చూపించండంటూ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి బైకులను ఆపుతుంటారే తప్ప, అడ్డుగా నిలిపిన ఆటోల సంగతి పట్టించుకోరు. కేవలం ఆటోవారితో ఉండే వీరికి ఉండే లాలూచీయే ఇందుకు కారణమని ప్రయాణీకులు విమర్శిస్తున్నారు. ఫైన్‌ల కోసం పాకులాడే ట్రాఫిక్ పోలీసులు ఆటోలను సరిగా పార్కింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు."

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేరుకే నగరం.. సౌకర్యాల కల్పనలో పురపాలక సంఘానికి సాటిరాదు. అయినా నగరపాలక సంస్థగా రూపాంతరం చెంది పదేళ్లు పూర్తి చేసుకోనుంది. జిల్లా కేంద్రంగా ఉన్నా నగర అవసరాలకు తగ్గట్టుగా రోడ్ల సౌకర్యం లేదు. రోడ్డునే పార్కింగ్ కేంద్రాలుగా చేసుకొని కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలుపుతున్న పరిస్థితి. ప్రతి 20 ఏళ్లకు రూపొందించే మాస్టర్ ప్లాన్ అమలుకు నోచుకోవడం లేదు. రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యం కారణంగా మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణకు నోచుకోవడం లేదు. జనాభాకు తగ్గట్టుగా వాహనాలు పెరిగాయి. నగరానికి జిల్లా నలుమూలల నుంచి వివిధ అసరాల కోసం వచ్చేవారి రాకపోకలతో నగరంలోని మార్కెట్లు రద్దీగా ఉంటాయి. మార్కెట్లో నడుచుకొని వెళ్లేందుకు అవకాశం లేనట్టుగా ఉంటుంది.

నగరంలో ఆటోల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. ఆటోనే జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్నవారు వేలల్లోనే ఉన్నారు. ప్రతి పది మీటర్లకు రెండు ఆటోలు రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. జనాల లెక్క ప్రకారం అడుగుకు ఒక ఆటో అన్నమాట. శ్రీకాకుళం నగరం లాంటి రోడ్లపై ఈ ఆటోలు రద్దీ ప్రాంతంలోనే ఎక్కువగా కనిపిస్తాయి. ఎక్కడ ఆగుతాయో, ఎక్కడ టర్న్ తీసుకుంటాయో తెలియదు. వెనుక నుంచి ఎవరు వస్తున్నారో వీరికి అనవసరం. రోడ్డు మధ్యలోనే ఆటో నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తుంటారు. నగరంలోని అన్ని ప్రధాన కూడల్లో ఈ ఆటోలు అస్తవ్యస్తంగా నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం కోసం ఉంచుతారు. వచ్చిపోయే వాహనాలతో పాటు కాలినడకన పోయే పాదచారులు సైతం ఇబ్బందులకు గురవుతుంటారు. వీరిని ఎవరైనా ప్రశ్నిస్తే మూకుమ్మడిగా ఎదురుదాడికి దిగుతుంటారు. ట్రాఫిక్ పోలీసులకు వీరు సన్నిహితంగా ఉంటూ ప్రధాన కూడల్లో ఉన్న కానిస్టేబుల్స్‌ను మేనేజ్ చేస్తుంటారు.





డే అండ్ నైట్ జంక్షన్ నుంచి బ్రిడ్జి వరకు, అంబేద్కర్ కూడలి నుంచి కాంప్లెక్స్ వరకు ఆటోల వల్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి. వీరికి ట్రాఫిక్ రూల్స్ అవసరం లేదు. ఎక్కడైనా ఆపేస్తారు, టర్న్ చేస్తారు. ఆటోను జీవనాధారంగా చేసుకొని జీవించే వారిని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో కాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండ పోలీసులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. నగరంలో అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. దీన్ని ఎవరూ క్రమబద్ధీకరించే సాహసం చేయడం లేదు. గతంలో ఆటోలను క్రమబద్ధీకరించే ప్రయత్నం చేసినా రాజకీయ నాయకుల జోక్యం కారణంగా యధాస్థితికి చేరింది.

కాంప్లెక్స్ ప్రాంతానికి ఆటోలను అనుమతించకుండా నిషేధించారు. రోడ్డుపై నిలిపే ఆటోలపై అపరాధ రుసం విధించేవారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దిశానిర్దేశం చేసేవారు. ప్రస్తుతం దాన్ని పక్కన పెట్టారు. దీంతో ఆటోవాలాలు ఇష్టానుసారంగా రోడ్డుపై పార్కింగ్ చేసి వాహనచోదకులు, పాదచారుల నిగ్రహాన్ని పరీక్షిస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆటోవాలా తీరువల్ల ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలైనవారూ ఉన్నారు. జంక్షన్ వద్ద కాకుండా కొద్ది దూరంలో ట్రాఫిక్‌కి అంత రాయం లేకుండా ఉండేలా ఆటోలు నిలుపుకొనేలా పోలీ సులు చూడాలని కోరుతున్నారు. ఆటోవాలాలకు ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించడం అవసరమని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# వజ్రాల వేటలో తమన్నా బిజీ!



మిల్కీబ్యూటీ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ ఫుల్ స్వింగ్లో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. స్టార్ హీరోల సరసన అవకాశాలు లేకపోయినా? తనదైన బ్రాండ్ తో కొత్త ఛాన్సులు ఒడిసి పట్టుకుంటుంది. సోలోగా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటే ప్రయత్నాలు చేస్తోంది. ఓవైపు ఇలా సినిమాలు చేస్తూనే మరోవైపు ఐటం భామగానూ దూకుడు కొనసాగిస్తోంది. ఇటీవలే స్త్రీ -2లో ఐటం పాటతో మరోసారి మెరిసింది. ప్రస్తుతం "ఓదెల-2"లో నటిస్తోంది. అలాగే సికిందర్ కా ముక్దర్ అనే సినిమాలోనూ తమన్నా నటిస్తోంది అన్న విషయం కన్ఫమ్ అయింది. ఇంతకాలం ప్రచారంలో ఉన్న వార్త ఇప్పుడు ఖరారైంది. చోరీకి గురైన 60కోట్ల వజ్రాలు..ఓటమిని అంగీకరించని ఇన్ స్పెక్టర్ అనే వ్యాఖ్యల్ని జోడిచింది. దీంతో ఈ కథ వజ్రాల బ్యాక్ డ్రాప్ లో సాగుతుందని తెలుస్తోంది. రహస్యం, నేరం, సంకల్పం లాంటి అంశాలతో క్రైమ్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రాన్ని నీరజ్ పాండే తెరకెక్కిస్తున్నారు. అవినాష్ తివారీ, జిమ్మీ షెర్గిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని థియేటర్ లో కాకుండా ఓటీటీలోనే రిలీజ్ చేస్తున్నారు. ఇలా తమన్నా సినిమాల పరంగా బిజీగానే ఉంది. అలాగే వెబ్ సిరీస్ లు కూడా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే తెలుగు, హిందీల్లో కొన్ని వెబ్ సిరీస్ లు చేసిన అమ్మడు ప్రస్తుతం డార్లింగ్ పార్టనర్స్ అనే సిరీస్ చేస్తోంది. ఇక్కడ అమ్మడు మరింత బోల్డ్ పెర్మార్మెన్స్ తో అదర గొడుతుంది. తమన్నా బ్యూటీని వెబ్ సిరీస్ లు పర్ఫెక్ట్ గా హైలైట్ చేస్తున్నాయి. సినిమాల్ని మించి ఇక్కడ మరింత ఫేమస్ అవుతుంది. అలాగే వ్యక్తిగతంగానూ అమ్మడు సాఫీగా సాగిపోతుంది. విజయ్ వర్మతో కొంత కాలంగా ప్రేమలోనూ మునిగి తేలుతోంది. ఈ విషయంలో తమన్నా కొంత ఒత్తిడిని ఎదుర్కుంటుంది. వివాహం ఎప్పుడు అంటూ తమన్నా కి రోజూ వేలల్లో పోస్టులు పాస్ అవుతున్నాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# 'పుష్ప 2' దెబ్బకు రష్మిక బాలీవుడ్ మూవీ అవుట్?



ఇప్పుడు మీడియాలో, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా 'పుష్ప-2' గురించే చర్చలు జరుగుతున్నాయి. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇక ఈ సినిమా 1000 కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ చేసిందనే వార్తలు ట్రేడ్ వర్గాల్లో సంచలనంగా మారాయి. ఇటీవల కాలంలో ఏ సినిమాకి కూడా ఆ రేంజ్‌లో క్రేజ్ రాలేదనే చెప్పాలి. అందుకే ఈ చిత్రాన్ని హిందీ చిత్రాలు తమ రిలీజులను వాయిదా వేసుకునే పరిస్థితి ఏర్పడింది. "పుష్ప 2: ది రూల్" చిత్రాన్ని ముందుగా ఆగస్టు 15న విడుదల చేయాలని అనుకున్న సంగతి తెలిసిందే. అయితే అదే డేట్ 'సింగం ఎగైన్' సినిమాని థియేటర్లలోకి తీసుకురావాలని భావించారు. రోహిత్‌శెట్టి దర్శకత్వంలో అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, రణవీర్‌సింగ్, కరీనా కపూర్ ఖాన్, దీపికా పదుకునే వంటి బాలీవుడ్ స్టార్స్ కలిసి నటించిన మూవీ ఇది. అంత పెద్ద స్టార్ కాస్టింగ్ తో రూపొందుతున్నప్పటికీ, మేకర్స్ 'పుష్ప-2' ని చూసి వెనక్కి తగ్గారు. ఇండిపెండెన్స్ డేకి 'పుష్ప: ది రూల్' వస్తుందనే ఉద్దేశ్యంతో 'సింగం ఎగైన్' మూవీని నవంబర్ 1వ తేదీకి పోస్ట్ పోన్ చేసుకున్నారు. అయితే అనుకున్న సమయానికి పనులు జరగకపోవడంతో 'పుష్ప-2' మేకర్స్ డిసెంబర్ 6వ తేదీకి వాయిదా వేసుకున్నారు. కానీ ఇప్పుడు ఈ సినిమా ఒకరోజు ముందుగా, అంటే డిసెంబర్ 5నే విడుదల చేయనున్నారని సమాచారం. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడానికే, చిత్ర యూనిట్ గురువారం మధ్యాహ్నం ప్రెస్ మీట్ పెడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే 'పుష్ప 2' క్రేజ్ చూసి, డిసెంబర్ ఫస్ట్ వీక్ లో రిలీజ్ ప్లాన్ చేసుకున్న మరో భారీ బాలీవుడ్ మూవీ "ఛావా" వాయిదా పడే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. ఛత్రపతి శివాజీ పెద్దకుమారుడు, మరాఠా వీరుడు ఛత్రపతి శంభాజీ జీవిత కథ ఆధారంగా, భారీ బడ్జెట్ తో రూపొందుతోన్న ఎపిక్ హిస్టారికల్ డ్రామా ఇది. దీంట్లో విక్కీ కౌశల్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న "ఛావా" చిత్రాన్ని డిసెంబరు 6వ తారీఖున విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. నార్త్ మార్కెట్ లో ఈ సినిమాకి మంచి క్రేజ్ వుంది. కానీ ఉత్తరాదిలో 'పుష్ప 2' చుట్టూ నెలకొన్న బజ్ చూస్తుంటే, ఆ సినిమాని తట్టుకొని బాక్సాఫీస్ వద్ద నిలబడగలదా? అని నిర్మాతలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైతే చావా పోస్ట్ పోన్ గురించి అఫిషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు. అయితే సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలే ఎక్కువ ఉన్నాయని బీటౌన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. 'పుష్ప 2', 'ఛావా' రెండు చిత్రాల్లోనూ రష్మిక హీరోయిన్ గా నటిస్తోంది. నేషనల్ క్రష్ సినిమాలు ఒకేసారి బాక్సాఫీస్ వద్ద పోటీకి దిగుతాయా? లేదా వాటిల్లో ఒకటి వెనక్కి తగ్గుతుందా? అనేది ఈ వారంలో తెలిపోతుంది. ఒకవేళ విక్కీ కౌశల్ సినిమా పోస్ట్ పోన్ అయితే మాత్రం.. అల్లు అర్జున్ సినిమా నార్త్‌లో ఎలాంటి పోటీ లేకుండా సోలోగా రిలీజ్ అవుతుంది. ఇది బాలీవుడ్ లో భారీ ఓపెనింగ్స్ రాబట్టడానికి అవకాశం కల్పిస్తుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# 'ది రాజాసాబ్' కొత్త పోస్టర్‌పై ట్రోలింగ్ షురూ!


ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా నిన్న 'ది రాజాసాబ్' మేకర్స్ ఓ అప్డేట్ ఇస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ఏదైనా టీజర్ లాంటిది రిలీజ్ చేస్తారేమో అని అంతా అనుకున్నారు. కానీ 'ది రాజాసాబ్'లో ప్రభాస్‌కి సంబంధించిన మరో లుక్‌ని రివీల్ చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రభాస్ నెరిసిన జుట్టు, గడ్డంతో, నోట్లో సిగార్ పెట్టుకుని భయంకరంగా కనిపిస్తున్నాడు.





ఇది హర్రర్ రొమాంటిక్ కామెడీ సినిమా అని మేకర్స్ ముందు నుండి చెబుతూనే వచ్చారు. అలాగే ఇందులో ప్రభాస్ ఓ దెయ్యంలా కనిపిస్తాడని కూడా చెప్పడం జరిగింది. అందులో భాగంగానే ఈ పోస్టర్‌ని వదిలినట్టు స్పష్టమవుతుంది. ఇక ఈ పోస్టర్‌ని చూసిన ప్రభాస్ అభిమానులు బాగా హర్ట్ అయ్యారు. ఇక యాంటీ ఫ్యాన్స్ అయితే ఓ రేంజ్లో ట్రోల్ చేస్తున్నారు. 'నాగవల్లి' సినిమాలో వెంకటేష్ అఘోర పాత్రని గుర్తు చేస్తూ నెగిటివ్ కామెంట్లు పెడుతున్నారు. సాధారణంగానే ప్రభాస్‌కి సంబంధించిన ఏ అప్డేట్ అయినా ఓ రేంజ్లో ట్రెండ్ అవుతూ ఉంటుంది. ఇది కూడా అలాగే ట్రెండ్ అవుతుంది కానీ.. ఇది కొంచెం నెగిటివ్ ట్రెండ్ అని చెప్పాలి. ఏదేమైనప్పటికీ.. మేకర్స్ ఈ పోస్టర్‌ను విడుదల చేసి ఓ రకంగా మంచి పనే చేశారు అని చెప్పాలి. ఎందుకంటే.. ప్రభాస్ సెకండ్ లుక్ ఎలా ఉంటుంది అనే ఒక క్లారిటీ వచ్చింది. సో ఆడియన్స్ ప్రిపేర్ అయ్యి ఉంటారు కాబట్టి.. రిలీజ్ తర్వాత ఆ రేంజ్లో ట్రోలింగ్ ఉండకపోవచ్చు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..



# ఒక ఓటమి.. మరో చరిత్రకు నాంది!

**కొందరికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తే.. కొందరికి గడప వరకు వచ్చిన అవకాశాలు ఇంట్లోకి రాకుండా వెనక్కి తిరుగుతాయి. విజేతల చరిత్రను గుర్తుపెట్టుకున్నంతగా పరాజితులను, అవకాశాలను కోల్పోయిన వారి గురించి గుర్తుపెట్టుకోం. ఒక నాయకుడికి పదవి దక్కటం వెనుక జరిగిన మంత్రాంగం, తంతాంగ్రం మనకు అరుదుగా తెలుస్తాయి. ఎక్కువ శాతం నాయకుల ఆత్మకథల వల్లనే మనకు ఆనాడు తెరవెనుక జరిగిన సంగతులు తెలుస్తాయి. పీఎన్ హక్సర్, బాబు రాష్ట్రపతిని చేశానన్న పీసీ అలెగ్జాండర్, ఐజీ పటేల్ గురించి ఎంతమందికి తెలుసు? పీవీ కన్నా ముందు ప్రధాని పదవికి కాంగ్రెస్ పరిశీలించింది ఎవరి పేరును? అనేక రాజకీయ మలుపులు, కీలక సంఘటనలు, వ్యక్తుల పాత్రల గురించి చదవండి.**

నారాయణ్ దత్ తివారి (ఎన్‌జీ తివారీ) 2018 అక్టోబరు 18 తన 93వ పుట్టినరోజు నాడు చనిపోయారు. తివారి అంటే ఆంధ్రా ప్రజలకు గవర్నర్ భవన్లో రాసలీలలు సాగిస్తూ టీవీ స్టింగ్ ఆపరేషన్‌కు దొరికి గవర్నర్ పదవికి రాజీనామా చేసిన రాజకీయ నాయకుడు గుర్తుకు రావటం సహజం. కాని ఆయనది సుదీర్ఘ, ప్రాముఖ్యత ఉన్న రాజకీయ చరిత్ర. పీవీ నరసింహారావ్ ప్రధాని కావటానికి ప్రత్యక్ష కారణం తివారి. 1991 ఎన్నికల ప్రచారంలో రాజీవ్ గాంధీని ఎల్‌టీటీఈ హత్య చెయ్యటం అందరికి తెలిసిందే. ఆ ఎన్నికల్లో గెలుపు కోసం రాజీవ్ తీవ్రంగా కృషి చేస్తూ దేశం మొత్తం ప్రచారం చేశారు. 1991 ఎన్నికల్లో యువకులకు అవకాశం ఇవ్వాలని తలచి కాంగ్రెస్‌లో సీనియర్లు అయిన తివారీ తదితరులను పోటీకి దూరంగా ఉండమని చెప్పారు. పీవీ రాజీవ్‌తో చెప్పించుకోకుండానే ముందుగానే పోటీకి దూరంగా ఉండి మ్యానిఫెస్టో బాధ్యతలు చూసుకున్నారు. పీవీ పోలింగు,రాజీవ్ మరణానికి ముందే ఢిల్లీ నుంచి హైదరాబాదుకు మకాం మార్చారు. మొదటి దశ పోలింగ్ ముగిసిన తర్వాత 1991 మే 21న రాజీవ్ హత్య జరిగింది. రాజీవ్ అంత్యక్రియలతో పాటు, కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడి ఎన్నికకు ప్రయత్నాలు ఢిల్లీలో మొదలయ్యాయి. రాజీవ్ చనిపోయిన రెండవ రోజే సోనియా కాంగ్రెస్ కొత్త అధ్యక్షురాలు అని పత్రికలు రాశాయి. అర్జున్ సింగ్, ఫోతేదార్ తదితరులు సోనియా గాంధీని అధ్యక్ష పదవి చేపట్టమని కోరగా ఆవిడ తిరస్కరించారు. అందరిలో సీనియర్, గాంధీ కుటుంబానికి విధేయుడు ముఖ్యంగా బలమైన ఉత్తరప్రదేశ్ బ్రాహ్మణ వర్గానికి చెందిన తివారీ సహజంగానే అధ్యక్షుడు కావలసింది. కానీ ఆయన రాజీవ్ సూచనను కాదని ఆ ఎన్నికల్లో పోటీ చెయ్యటంతో ఆయన అవకాశాలు దెబ్బతిన్నాయి.

సోనియాకు సన్నిహితంగా ఉండే నట్వర్ సింగ్ తదితరులు ఇందిరా ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన పీఎన్ హక్సర్ సలహా తీసుకోమని ఆవిడకు సలహా ఇచ్చారు. హక్సర్ అప్పటి ఉపరాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మను అధ్యక్షుడిగా ఎన్నుకోమని సలహా ఇచ్చారు. సోనియా దూతలుగా శంకర్ దయాళ్ శర్మ వద్దకు నట్వర్‌సింగ్, అరుణ ఆసఫ్ అలీ వెళ్లారు. అప్పటికి 77 సంవత్సరాల వయస్సు, కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్న శంకర్ దయాళ్ అంత పెద్ద బాధ్యతను తీసుకోలేనని దేశం అంతా తిరిగి ఎన్నికల ప్రచారం చెయ్యలేనని సున్నితంగా సోనియా ఆహ్వానాన్ని తిరస్కరించారు. అదే సందర్భంలో రాష్ట్రపతి పదవి కోసం ఎదురు చూస్తున్నట్లు మనసులో మాట బయట పెట్టారు. శంకర్ దయాళ్ శర్మ కాదనటంతో సోనియా మరోసారి హక్సర్ సలహా అడిగారు. ఈసారి ఆయన పి.వీ. నరసింహారావు పేరు సూచించారు.

కొత్త అధ్యక్ష పదవికి అనేక మంది పోటీపడ్డారు. అర్జున్ సింగ్, మాధవరావు సింధియా, శరద్ పవర్, ప్రణబ్ ముఖర్జీ తదితరులు చేసిన ప్రయత్నాలకు పార్టీలోని ఇతర వర్గాల నుంచి మద్దతు దక్కలేదు. కానీ, వీరిలో ఎవరైనా పార్టీని చీలుస్తారేమో అన్న సంశయంతో కొత్త అధ్యక్షుడి ఎన్నిక మీద చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. శరద్ పవార్, ప్రణబ్ ముఖర్జీ గతంలో కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లి సొంత పార్టీలు పెట్టినవారే! 1991 మే 29న పీవీ కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టారు. రాజీవ్ హత్యతో వాయిదా పడ్డ ఎన్నికలు జూన్‌లో జరిగాయి. కాంగ్రెస్ 531స్థానాలకు కాను 235 స్థానాలు గెలిచింది. ప్రధాని పదవికి కాంగ్రెసులో మరోసారి పోటీ నెలకొంది. అధ్యక్షుడు పీవీ సహజంగా ప్రధాని కావాలి. శరద్ పవార్ కాంగ్రెస్ ఎంపీల అభిప్రాయాన్ని సీక్రెట్ బ్యాలెట్ ద్వారా తీసుకోవాలని పట్టుబట్టారు. అర్జున్ సింగ్ తనను ప్రధానిని చెయ్యాలని కోరారు. రాజీవ్ వద్దన్నా పోటీ చేసిన ఎన్‌డీ తివారి తన కంచుకోట నైనిటాల్ నుంచి 11వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. దానితో ఆయన పేరు చర్చకు రాలేదు. తివారీ అర్జున్ సింగ్‌కు మద్దతు ఇచ్చారు. తివారీ గెలిచి ఉంటే ప్రధాని పదవి పోటీ పీవీ, తివారి మధ్యనే ఉండేది. పీవీ తరఫున ఇందిరా, రాజీవ్ వద్ద ప్రిన్సిపల్ సెక్రటరీ, తమిళనాడు గవర్నర్‌గా పనిచేసిన పీసీ అలెగ్జాండర్, చంద్రస్వామి కాంగ్రెసులోని వివిధ వర్గాలతో సంప్రదింపులు జరిపారు. పత్రికలు రాజీవ్ రహస్య మిత్రుడు అని పేర్కొన్న జనతా నాయకుడు సుబ్రమణ్యస్వామి కూడా పీవీ తరఫున రంగంలో దిగారు. రాజీవ్ మిత్రుడు కెప్టెన్ సతీష్ శర్మను పీవీ ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. పీవీకి దాదాపు మార్గం సుగమం అయ్యింది. అనేక చర్చల తర్వాత శరద్ పవార్ తనకు ఉప ప్రధాని పదవి ఇస్తే పీవీకి మద్దతు ఇస్తానని ప్రకటించారు. పీవీ దానికి అంగీకరించకుండా ముఖ్యమైన మంత్రి పదవి ఇస్తానని చెప్పారు. ఈ ప్రతిపాదనకు శరద్ పవర్ అంగీకరిచటంతో ఆయన రక్షణ శాఖ మంత్రి అయ్యారు. మహారాష్ట్రకే చెందిన తన అనూయుడు ఎస్‌బీ చవాన్‌ను హోంమంత్రిని చేసి పీవీ చాణక్యాన్ని ప్రదర్శించారు.

ఎన్నికల్లో ఓడిపోయిన తివారి తనకు మంత్రి పదవి ఇవ్వమని అడిగినా పీవీ అంగీకరించలేదు. అసలు తివారి ఓటమి వెనుక ఒక కథ ఉంది. 1991 ఎన్నికల్లో అయోధ్య ప్రధాన అంశంగా బీజేపీ బరిలోకి దిగింది. తివారి తన ఎన్నికల ప్రచారానికి దిలీప్‌కుమార్‌ను తీసుకొచ్చారు. దిలీప్ కుమార్ ప్రచారం చేస్తున్న సందర్భంలో ప్రజలు ముస్లిం అయిన నువ్వు దిలీప్‌కుమార్ అని పేరు ఎందుకు మార్చుకున్నావ్ అని వాదనకు దిగారు. పోలీసులు ఆందోళనకు దిగిన ప్రజలను అదుపు చేశారు కానీ, ఓటర్లలో తివారి పట్ల వ్యతిరేకత ఏర్పడి తుదకు ఆయన ఓటమికి దారి తీసింది. ఆ విధంగా తివారి చేజార్చుకున్న అధ్యక్ష పదవి, ప్రధాని పదవి పీవీకి దక్కాయి. అయోధ్య వివాదం, ఆర్థిక విధానాలు, అవినీతి తదితర అంశాలు 1994 నాటికి పీవీని బాగా ఇబ్బంది పెట్టాయి. అర్జున్ సింగ్ లాంటి మంత్రులు పీవీ మీద నేరుగా విమర్శలు చెయ్యసాగారు. 'ఎ పరెప్షన్ హేజ్ ఎమెర్జ్‌డ్ దట్ లిబరైజేషన్ ఆఫ్ ఎకనొమిక్ పాలసీ పెర్‌హేప్స్ హేజ్ బికమ్ రిబరైజేషన్ ఆఫ్ కరప్షన్' అని బాగా విమర్శలు చేసేవారు. చివరికి పీవీ అర్జున్ సింగ్‌ను మంత్రి పదవికి రాజీనామా చెయ్యమని కోరారు. మంత్రి పదవి నుంచి తప్పుకున్న అర్జున్ సింగ్ తివారి, నట్వర్ సింగ్, షీలా దీక్షిత్ తదితరులతో కలిసి 1994లో కాంగ్రెస్(తివారి) పేరుతో కొత్త పార్టీ పెట్టారు.

1996 ఎన్నికల్లో తివారి కాంగ్రెస్ (ఏఐసీసీ(టి)) 321 స్థానాలలో పోటి చేసి నాలుగు చోట్ల గెలిచి 310 చోట్ల డిపాజిట్లు కోల్పోయింది. అర్జున్ సింగ్, నట్వర్ సింగ్ ఇద్దరు ఓడిపోయారు. తివారి, సత్పాల్ మహారాజ్, శీష్ రాం ఓలా గెలిచారు. ఆంధ్రా నుంచి కావూరి సాంబశివరావు మాత్రమే డిపాజిట్లు దక్కించుకున్నారు. మచిలీపట్నంలో కావూరి, రెడ్డయ్య యాదవ్ (మాజీ మంత్రి పార్థసారథి తండ్రి) మధ్య కాంగ్రెస్ ఓట్లు చీలటంతో టీడీపీ తరఫున కైకాల సత్యనారాయణ గెలిచారు.

సోనియా గాంధీ రాజకీయ ప్రవేశం తర్వాత తివారీ కాంగ్రెసును కాంగ్రెసులో విలీనం చేసారు. 2000లో వాజ్‌పాయి ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌ను విడదీసి ఉత్తారాఖండ్‌ను ఏర్పాటు చేసిన తర్వాత 'తన శవం మీదనే ఉత్తరప్రదేశ్ విడిపోతుందని' అన్న తివారి 2002లో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ ఎన్నికల్లో కూడా తివారి ఉత్తరాఖండ్‌లో కాకుండా ఉత్తరప్రదేశ్లోనే ప్రచారం చెయ్యటం గమనార్హం. 2007 ఉత్తరాఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన తర్వాత తివారి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అవ్వటం, అమ్మాయిలతో ఉన్న వీడియోలు బయటపడటంతో రాజీనామా చెయ్యటం తెలిసిందే.

2017 ఉత్తరాఖండ్ ఎన్నికల ముందు కొడుకు రోహిత్ శేఖర్‌తో కలిసి బీజేపీలో చేరి రెండవరోజు లేదు నేను బీజేపీలో చేరలేదు నా కొడుకు మాత్రమే చేరాడని చెప్పారు. 1954లో పెళ్లి చేసుకున్న తివారికి పిల్లలు లేరు. 1968లో కేంద్ర మంత్రి షేర్‌సింఘ్ కూతురు ఉజ్వలా శర్మతో వివాహేతర సంబధం వలన రోహిత్ శేఖర్ పుట్టారు. కానీ, తివారి రోహిత్‌ను తన కొడుకుగా ఒప్పుకోకపోవటంతో కోర్టుల చుట్టూ తిరిగి 2012లో డీఎన్‌ఏ టెస్ట్ ద్వారా రోహిత్ తివారీ కొడుకే అని ఉజ్వలాశర్మ నిరూపించుకున్న తర్వాత 87 సంవత్సరాల వయస్సులో 2012లో తివారి ఆమెను పెళ్లి చేసుకొని రోహిత్‌ను కొడుకుగా అంగీకరించారు. తివారి చివరి రోజుల్లో రోహితే ఆయన బాధ్యతలు చూసుకున్నారు 2018 అక్టోబరు 18న తివారి చనిపోయారు. ఆరోజు ఆయన పుట్టినరోజు కూడా. భారతదేశం మొత్తంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ముఖ్యంగా 1956 రాష్ట్రాల పునఃవిభజన తర్వాత 2 రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా పని చేసిన ఏకైక నాయకుడు తివారి.

ప్రకాశం పంతులు మద్రాస్, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేశారు. కానీ, మద్రాస్ రాష్ట్రానికి స్వాతంత్ర్యం రాకముందు 1946 మార్చి నుంచి 1947 ఏప్రిల్ మధ్య ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా 1976, 84, 88ల్లో పనిచేసారు. యూపీకి మూడుసార్లు ముఖ్యమంత్రి అయినా ఒక్కసారి కూడా పూర్తి కాలం పాలించలేకపోయినా 2002-2007 మధ్య మాత్రం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పాలించారు. భారత గవర్నర్ జనరల్‌గా పనిచేసి, ప్రధాని పదవికి నెహ్రూతో పోటిపడిన రాజగోపాలాచారి తర్వాత మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇదే కోవలో తివారి ప్రధాని స్థాయి నేత అయ్యుండి గుప్పెడంత రాష్ట్రాని ముఖ్యమంత్రి పనిచేశారు. ఈ సందర్భంలో మన్మోహన్ సింగ్ గురించి కూడా చెప్పుకోవాలి. పీవీ ప్రధాని అయిన తర్వాత మొదట ఐజీ పటేల్ (మాజీ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్)ను ఆర్థిక మంత్రిగా తీసుకోవాలని అనుకున్నారు. కానీ, ఆయన అగీకరించకపోవటంతో మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా తీసుకున్నారు. పటేల్ పీవీ ఆహ్వానాన్ని అంగీకరించి ఉంటే.. మన్మోహన్ సింగ్ రాజకీయాల్లోకి రావటం, ప్రధాని కావటం జరిగి ఉండేవా..?

**అబ్దుల్ కలాం గురించి కూడా ఓ మాట!**

2002లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు సొంతంగా రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థులను గెలిపించుకునే బలం లేదు. ఏకగ్రీవంగా రాష్ట్రపతిని ఎన్నుకోవాలని అనుకున్నారు. బీజేపీ/ ఎన్‌డీయే మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేస్తున్న పీసీ అలెగ్జాండర్ పేరును ప్రతిపాదించింది. ఇందిరా, రాజీవ్ వద్ద పనిచేసి ఉండటం, పీవీతో సన్నిహిత సంబధాలు ఉండటం తదితర కారణాలతో సోనియా పీసీ అలెగ్జాండర్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తారని వాజ్‌పాయ్ భావించారు. కానీ, సోనియా అంగీకరించలేదు. దీనితో అబ్దుల్ కలాం పేరు తెర మీదికి వచ్చింది. కలాం అభ్యర్థిత్వాన్ని కమ్యూనిస్టేతర ముఖ్యపార్టీలన్నీ అంగీకరించాయి. కమ్యూనిస్టులు అజాద్ హిందు ఫౌజ్‌లో పనిచేసిన కెప్టన్ లక్ష్మి సెహగల్‌ను పోటీకి పెట్టారు. నామమాత్రపు పొటీలో కలాం గెలిచారు.

దేవగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో 1997లో కలాంకు భారతరత్న రావటంతో ఆయనకు క్రియాశీలక గుర్తింపు వచ్చింది. అదే రాజకీయ పార్టీలు ఆయన్ను రాష్ట్రపతిగా ఎన్నుకోవటానికి తోడ్పడింది. తెర వెనుక కీలకంగా వ్యవహరించిన హక్సర్, అలెగ్జాండర్ లాంటి వారి గురించి ఎక్కువ మందికి తెలియకపోవచ్చు కానీ.. వారికి చరిత్రలో సుస్థిర స్థానం దక్కుతుంది. నేతల ఆత్మకథల్లో వారి ప్రాధాన్యత లిఖించపడుతుంది.

- రమణ కొంటికర్ల

## పాలక మండలుల్లో విశ్వబ్రాహ్మణులకు స్థానం కల్పించండి.!

(సత్యంన్యూస్, విజయనగరం)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో దేవాలయ పాలకమండలి సభ్యుల సంఖ్యను 17కు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం, పాలకమండలలో బ్రాహ్మణులకు, నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పించడంపై ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి టేకి విశ్వంభరరావు (మందరాడ) హర్షం తెలిపారు. అదే సమయంలో దేవాలయాల నిర్మాణంలో, విగ్రహాల తయారీలో, నగల తయారీలో, శిల్పాల తయారీలో, వాస్తులో అన్నిట్లో ముఖ్య భూమిక పోషిస్తున్న, పోషించిన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కుటుంబాలకు కచ్చితంగా అవకాశం కల్పించాల్సి ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు లోతుగా ఆలోచించి కూటమి పార్టీల అఖండ విజయానికి కారణమైన విశ్వబ్రాహ్మణ కులాలను, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి దన్నుగా ఉన్న బీసీ కులాల్లో భాగమైన దాదాపు 40లక్షల పైగా జనాభా గల విశ్వబ్రాహ్మణ (పంచవృత్తుల) వారికి దేవాలయాల పాలక మండల్లో అవకాశం కల్పించి వారిని ప్రోత్సహించాల్సిందిగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులందరూ వెంటనే సంఘటితమై విజ్ఞప్తిని వారి వారి శాసనసభ్యులకు, మంత్రులకు విన్నవించే ప్రయత్నం చేయాలని సూచించారు.

## పోలియో శాశ్వత నిర్మూలనే రోటరీ ధ్యేయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




పోలియో శాశ్వత నిర్మూలనే రోటరీ ధ్యేయమని రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులుముని శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా గురువారం రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో పోలియోపై అవగాహన, విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ ఏడాది శ్రీకాకుళం రోటరీ క్లబ్ పోలియో చైర్మన్ అన్నెపు అనంతరావు ఆధ్వర్యంలో పోలియో నిధికి రూ.5 లక్షలు విరాళాల సేకరణ లక్ష్యంగా ప్రారంభించి ఇప్పటి వరకు లక్ష రూపాయలు విద్యార్థుల ద్వారా సేకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సెక్రటరీ డి.శివశంకర్, క్లబ్ కార్యదర్శి దూసి సంతోష్, కోశాధికారి పసగాడ సూర్య, పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ ఎంఆర్‌కె దాస్, డాక్టర్ మంత్రి వెంకటస్వామి, ప్రతినిధులు డాక్టర్ బమ్మిడి సందీప్, డాక్టర్ వారణాసి సందీప్, ఇప్పిలి వెంకన్న శెట్టి, కిల్లాన శ్రీనివాసరావు, ధర్మాన ధర్మారావు, బి.గిరి, జై శ్రీరామ్, దుంగ సుధాకర్, ఎమ్మెస్ విజయ్‌కుమార్, బరాటం శ్రీనివాస, మోనంగి మురళీమోహన్, చాగంటి జగదీష్ కుమార్, మల్లా రమేష్ కుమార్, వి.సంతోష్ కుమార్, చాగంటి జగదీష్, రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధాలు వద్దు.. శాంతి ముద్దు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ శాంతిని, సౌభ్రాతృత్వాన్ని కాక్షిస్తూ ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఇంటాక్ కో కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అశాంతి, అభద్రత రాజ్యమేలుతున్న తరుణంలో అన్ని దేశాలు శాంతి సందేశం ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ దేశాల మధ్య శాంతిని కాపాడటం అనే ప్రధాన లక్ష్యాలతో ఐక్యరాజ్య సమితి ఏర్పడిందని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బివి రవిశంకర్ అన్నారు. భద్రతామండలిలో భారత్‌కు సభ్యత్వం ఇవ్వాలని ఈ సందర్భంగా ముక్తకంఠంతో కోరారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్ శాసపు జోగినాయుడు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నేటి తరం యువతకు ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ పరిస్థితులు, సమితి లక్ష్యాలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం యుద్దాలు వద్దు.. శాంతి ముద్దు అంటూ వాకర్స్ ప్రతినిధులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పీజీ గుప్తా, జి.లక్ష్మీ, ఎస్.సంజీవరావు, గుడ్ల జగ్గారావు, జి.వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, మామిడి రామారావు, పొట్నూరు నాగేశ్వరరావు, డాక్టర్ జి.నారాయణ రావు, ఎండ మోహన్, పట్నాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

## 25న జాబ్ మేళా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతకు మినీ జాబ్‌మేళా కార్యక్రమాన్ని బలగ ప్రభుత్వ ఐటిఐ కళాశాలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో 4 స్థానిక, బహుళజాతి కంపెనీలు పాల్గొని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తాయని, అర్హత కలిగిన నిరుద్యోగ యువత వారి వారి విద్యార్హత పత్రాల నకలు, ఆధార్‌కార్డు నకలు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 78934 54256 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

























## అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

**94403 72300, 98487 96626**


## రాష్ట్ర పండుగగా సూర్యదేవుని జయంతి

**- రథసప్తమి వేడుకలకు సీఎం ఆమోదం**

**- ఎమ్మెల్యే గొండు శంకర్ వెల్లడి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ప్రత్యక్ష భగవానుడు సూర్యనారాయణ స్వామి కొలువైన అరసవల్లి పుణ్యక్షేత్రంలో ప్రతి యేటా రథసప్తమి వేడుకలు ఘనంగా జరుగుతాయి. సూర్యజయంతిని పురస్కరించుకుని అరసవల్లిలో అంగరంగ వైభవంగా జరిగే రథసప్తమి వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా భక్తులు తరలి వస్తుంటారు. రథసప్తమి పర్వదినం ఇప్పటి వరకు జిల్లా వరకే పరిమితం కాగా, రానున్న రథసప్తమి రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ రథసప్తమి పర్వదినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేయగా, అయన సానుకూలంగా స్పందించినట్లు శంకర్ తెలిపారు. ఇప్పటికే ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారని, త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ కానున్నట్టు వివరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4న అరసవల్లిలో రథసప్తమి వేడుకలు రాష్ట్ర పండుగలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు శంకర్ తెలిపారు. తన వినతి మేరకు సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు, సహకరించిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### మనుషులే కాదు పశువులు తాగడానికీ

# ఆ నీరు పనికిరాదు!

- ✔ కిల్లిపాలెం ఇసుక ర్యాంపు అనుకూలంకాదు
- ✔ 'సత్యం' కథనంపై క్షేత్రస్థాయి పరిశీలకు వెళ్లిన గనులశాఖ


తనిఖీ నివేదిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కిల్లిపాలెంకు నైరుతిలో నాగావళి నదిలో ప్రస్తుతం ఉన్న నీరు మనుషులు తాగడానికే కాదు, పశువులకు కూడా తాగనివ్వొద్దని మైన్స్ శాఖ అధికారులు ఆ గ్రామ ప్రజలకు సూచించారు. కిల్లిపాలెం నదీ గర్భంలో పాతాళం లోతుకు ఇసుక తవ్వకాలు జరిపేశారంటూ 'సత్యం' బుధవారం ప్రచురించిన కథనంపై అదే రోజు సాయంత్రం గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు కిల్లిపాలెం వెళ్లి తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో పూర్తిగా ఇసుక లేదని, ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయని, ఇందులో కలుషితమైన నీరు మాత్రమే నిల్వ ఉందని, దీన్ని తాగు, సాగు, పశువుల ఉపయోగానికి మంచిది కాదన్నారు. నీటిలో ఉన్న పీహెచ్ లెవెల్స్ దారుణంగా పడిపోయాయని, 250 నుంచి 500 పాయింట్ల వరకు ఉండాల్సిన ఆక్సిజన్ లెవెల్స్ కేవలం 8 పాయింట్లు మాత్రమే ఇక్కడ కనిపిస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన రెడ్డి కృష్ణారావు, రెడ్డి భీమారావు, బాణ్ణ జగదీష్‌తో పాటు 15 మందిని వెంట పెట్టుకొని కిల్లిపాలెంలో ఇసుక తవ్విన ప్రాంతాలను పరిశీలించారు. ఇసుక రీచ్ కోఆర్డినేట్ ప్రకారం ఇసుక ఏమాత్రం ఇక్కడ సరిపోదని, ఇక్కడ ఎటువంటి ర్యాంపునకు అనుమతులు ఇవ్వకూడదని కలెక్టర్‌కు వీరు నివేదించారు. 2022 నుంచి 2024 వరకు విపరీతమైన తవ్వకాలు జరిగినందున ఇక్కడ ర్యాంపు ఇవ్వొద్దని ఇక్కడి స్థానికులు కోరుతున్నట్లు మైన్స్ శాఖ అధికారులు కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా 2020 నుంచి 2024 వరకు ఇక్కడ పూర్తిగా ఇల్లీగల్ మైనింగ్ జరిగింది. ఇసుక మాఫియా చెలరేగిపోయి నగరానికి దగ్గరగా ఉన్న కిల్లిపాలెం ర్యాంపు నుంచి పెద్ద ఎత్తున తవ్వకాలు జరిపింది. దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చినా, స్థానికులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే లేకపోయాడు. దీంతో ఇక్కడ భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. కేవలం కాలువల నుంచి పారుతున్న మురుగునీరు మాత్రమే నాగావళి నదిలో కనిపిస్తుంది.


- నదీతీరమంతా ఇసుకాసురులే
- బిల్లులు లేకుండానే హెవీ లోడింగ్
- కొన్నిచోట్ల ఎమ్మెల్యే కుటుంబానికి లింక్
- మరికొన్నచోట్ల ఎమ్మెల్యేలకే ఓనర్‌షిప్
- కిల్లిపాలెం ర్యాంపు వద్దంటూ వినతి
- 900కు చేరిన నీటి టీడీఎస్

ఇసుక ఉచితం..

షరతులు వర్తిస్తాయి!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉచితం.. షరతులు వర్తిస్తాయి

### బుడగట్లపాలెం హార్బర్ పనులు

## వేగవంతం చేయాలి



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

బుడగట్లపాలెం వద్ద సుమారు రూ.386 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్న ఫిషింగ్ హర్బర్ కోసం విశ్వసముద్ర హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్, రెవిన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, మత్స్య శాఖ ఉపసంచాలకులు శ్రీనివాసరావు, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సంబంధిత హార్బర్ పనులు వేగవంతం చేసేందుకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, ఎచ్చెర్ల, రణస్థలం మండల నాయకులు, బుడగట్లపాలెం సర్పంచ్ రాంబాబు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



సముద్ర తీరప్రాంతాల్లో ఉన్న సంతబొమ్మాళి, నౌపాడ సబ్ స్టేషన్లను, మూలపేట ఓడరేవును ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి గురువారం పరిశీలించారు. మేఘావృతమైన, తేలికపాటి గాలులతో వాతావరణం సాధారణంగా ఉందని గమనించారు. ఈ రాత్రి దాటనున్న దానా తుపానును ఎదుర్కొనేందుకు సరిపడా మనుషులను, సామగ్రి సిద్ధంగా ఉన్నట్లు ఎస్ఈ కృష్ణమూర్తి తెలిపారు.

– సత్యంన్యూస్, సంతబొమ్మాళి

# ప్రతిఒక్కరు ఒక మొక్క నాటండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర శ్రీకాకుళం ఆధ్వర్యంలో అగ్రికల్చరల్ కళాశాల నైరా సెమినార్ హాల్‌లో ఏక్ పెడ్ మా కే నామ్ తల్లి పేరున ఒక మొక్క నాటాలనే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా నైరా అగ్రికల్చరల్ కళాశాల ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అమ్మ పేరున ఒక మొక్కను నాటాలని ఆ మొక్కను అమ్మను చూసుకున్నట్లు జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్‌ఉజ్వల్ మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రారంభించిన కార్యక్రమం ముఖ్య ఉద్దేశం తల్లి ప్రేమను పెంచే శక్తి గురించి ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలని అన్నారు. అనంతరం నైరా అగ్రికల్చర్ ఆవరణలో మొక్కలు నాటారు. యువతీ యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నైరా అగ్రికల్చర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు, హెడ్ ప్రొఫెసర్స్ డాక్టర్ పి.గురుమూర్తి, డాక్టర్ జి.జోగినాయుడు, డాక్టర్ వై.రాజశేఖర్, నెహ్రూ యువ కేంద్ర గణాంకాధికారి, కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు, మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం కార్యదర్శి గుజ్జల ఉమామహేశ్వరరావు, శాంతి స్వరూప్ యువజన సేవా సంఘం కార్యదర్శి కళింగపట్నం రాము, ఎన్.వై.కె ఎన్.వై.వి మట్ట ప్రియాంక, అరుగుల దిలీప్‌కుమార్ యువతి తదితరులు పాల్గొన్నారు.

# పంచారామాలకు ప్రత్యేక బస్సులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నుంచి ప్రతిష్టాత్మక ఆధ్యాత్మిక కేంద్రాలైన పంచారామాల దర్శనం కోసం ఏపీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్తీకమాసంలో వివిధ శైవక్షేత్రాలు, పంచారామాలు, పిక్నిక్‌స్పాట్లకు వెళ్లేందుకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు.

పంచారామాలైన అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (క్షీరరామ లింగేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కుమారరామ భీమేశ్వరుడు) పుణ్యక్షేత్రాలను దర్శించేవారి కోసం సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నారు. ప్రతి ఆదివారం ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో సాయంత్రం 4 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరుతాయని, పంచారామాల క్షేత్రాల సందర్శన అనంతరం తిరిగి మంగళవారం తెల్లవారుఝామున శ్రీకాకుళానికి చేరుకుంటాయని ఆయన వివరించారు. శ్రీకాకుళం నుంచి ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీకి రూ.2,400, అల్ట్రా డీలక్స్ రూ.2,350, ఎక్స్‌ప్రెస్ రూ.2వేలు టికెట్ ఛార్జీగా నిర్ణయించారు. టికెట్లను apsrtconline.in వెబ్‌సైట్‌లో లేదా డిపో కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చని, ప్రత్యేకంగా బస్సును బుక్ చేసుకునే భక్తుల కోసం వారు కోరిన ప్రాంతానికి బస్సు పంపుతామని విజయ కుమార్ తెలిపారు

**శబరిమలకు ప్రత్యేక బస్సులు:**

శ్రీకాకుళం నుంచి ఆరు రోజుల యాత్రలో విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, వంట, సన్నిదానం, తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం దర్శనం తర్వాత శ్రీకాకుళం చేరుకుంటుంది.

ఏడురోజుల యాత్రలో విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, ఫళని, ఎరుమేలి, పంట, సన్నిధానం, మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, ద్వారపూడి, అన్నవరం దర్శనం తర్వాత శ్రీకాకుళం చేరుకుంటుంది.

శ్రీకాకుళం నుంచి విశాఖ దర్శిని, అరకు దర్శని, శైవ క్షేత్రాల దర్శిని, కోరుకున్న ప్రాంతాలకు పిక్నిక్‌స్పాట్‌లకు వెళ్లేందుకు అద్దె ప్రాతిపదికన, అందుబాటులోని ఛార్జీలతో బస్సులు కేటాయిస్తామని విజయకుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు శ్రీకాకుళంలో 99592 25608, 73829 21647, 99592 25609, 73829 17289, పలాస డిపోలో 99592 25610, 73829 24758, టెక్కలి డిపోలో 99592 25611, 73829 23311 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు.

# మిస్టర్ ఆంధ్ర పోటీలకు పలువురు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 27వ తేదీన విజయనగరంలో జరగనున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి కొంతమంది గురువారం గోపాల్ ఫిట్నెస్ జిమ్‌లో ఎంపిక చేశారు. వీరిలో 55 కేజీల విభాగంలో పి.రాజేష్, 60 కేజీల విభాగంలో ఎం.రఫీ ఖాన్ (గోపాల్ ఫిట్నెస్ జిమ్) 65 కేజీల విభాగంలో డి.గణేష్, 55 కేజీల విభాగంలో ఆర్.హరీష్ (ఆమదాలవలస) ఏయూ జిమ్, 65 కేజీల విభాగంలో ఎన్.రాజు ఆదిత్య జిమ్, 60 కేజీలు కె.సుమంత్, 70 కేజీలు ఆర్.గణేష్ (పలాస), ఏ.భాస్కరరావు మాస్టర్ క్యాటగిరీకి ఎంపికయ్యారు. వీరికి గోపాల్ ఫిట్నెస్ అధినేత గోపాల్‌తో పాటు శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలగ ప్రసాద్, శ్రీకాకుళం జిల్లా సెక్రటరీ వి.విజయకుమార్, టీం కోచ్ కె.గౌరీశంకర్ (ఆమదాలవలస) అభినందనలు తెలిపారు.



# చెట్లు భావితరాలకు మెట్లు

**- శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అమూల్యం**

**- జిల్లా పౌర సంబంధాల అధికారి బాలమాన్ సింగ్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చెట్లు భావితరానికి మెట్లని జిల్లా పౌర సంబంధాల అధికారి బాలమాన్ సింగ్ అన్నారు. స్థానిక పీఎస్ఎన్ఎం హైస్కూల్ ప్రాంగణంలో శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా సభ్యుల బృందం మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా పౌర సంబంధాల అధికారి బాలమాన్ సింగ్ మాట్లాడుతూ శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించటం హర్షణీయమన్నారు. నాటే ప్రతీ మొక్క, రేపటి తరానికి శ్రీరామరక్షని, నేటి మొక్కలే, రేపటి మేటి వృక్షాలై భావి తరాలకు ఉపయోగపడతాయని, మొక్కను ఎంత బాధ్యతో నాటుతున్నామో, వాటి సంరక్షణ బాధ్యతను సైతం చూడాల్సిన బాధ్యత మనందరిదన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శాసపు జోగినాయుడు, వైటీహెచ్ జిమ్ నిర్వాహకులు జి.చంద్రమౌళి, జుంబా డాన్స్ ఫౌండర్ బి.దేవిప్రసాద్, కళాశాల ప్రధానోపాధ్యాయులు బలివాడ భాస్కరరావులతో కలసి మొక్కలను నాటారు. అనంతరం జోగినాయుడు మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, మనం వాటిని సంరక్షిస్తే, అవి మానవ మనుగడను రక్షిస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చంద్రమౌళి, దేవిప్రసాద్, శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాడ గణపతి ప్రసంగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పమ్మిన నరేష్, కిల్లి రాము, కోశాధికారి బోనుల శంకరరావు, నాగరాజు, మురళి, రాజు, ఇతర సభ్యులు, పీఎస్ఎన్ఎం హైస్కూల్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# ఎంప్లాయ్మెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఎంప్లాయ్మెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సూర్య సునీత ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థినులకు డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగం సంపాదించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాల ఆవశ్యకత ఎంతగానో ఉంటుందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.సుధ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి టెన్త్ పూర్తయిన వెంటనే, ఎంప్లాయ్‌మెంట్ కోసం స్టేట్ పోర్టల్, నేషనల్ కెరీర్ ఫర్ సర్వీసెస్ తదితర పోర్టల్లలో తమ పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. తర్వాత మూడేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని, ఒకవేళ సమయానికి చేసుకోకపోతే ఆరు నెలలు గ్రేస్ పీరియడ్ ఉంటుందని, అప్పుడు కూడా రెన్యువల్ చేసుకోకపోతే మళ్లీ మొదటి నుంచి ప్రాసెస్ చేసుకోవాలని తెలిపారు. ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ వై.రవీంద్ర ఆయా పోర్టర్స్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, ఎం.ఎన్.పాఠక్ (వై.పి), రసాయన శాస్త్ర అధ్యాపకులు ఎం.రోహిణి, సీహెచ్ చాందిని, ఎస్.గీత, పి.కీర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.